క్లుప్తంగా

బాధితునికి ఆర్థిక సాయం



మున్నంగి(కొల్లిపర): మున్నంగి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో గాయపడిన జూపల్లి కిషోర్ అనే క్షతగాత్రుడికి శనివారం గ్రామానికే చెందిన మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మా సుజాత రూ.20వేలు సాయమందించారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, ది కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కాకి దేవ సహాయం, తెనాలి మండల సోషల్ మీడియా కన్వీనర్ ఎల్‌బీసీ చిన్ని ఉన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కొల్లిపర: కొల్లిపర గ్రామ శివారులోని పొలంలో శుక్రవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చి నలుగురు రైతులకు చెందిన.. ఐదు ఎకరాల మొక్కజొన్న పంట స్వల్పంగా కాలిపోయినట్లు శనివారం ఏవో కె.వెంకటరావు శనివారం తెలిపారు. మొత్తం పది ఎకరాల్లో మంటలు వ్యాపించగా ఐదు ఎకరాల్లో మాత్రం కోత తర్వాత పంట అవశేషాలు మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన పొలంలో మొక్కజొన్న కంకులు మంటలు అంటుకుని నల్లగా మారినట్లు పేర్కొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



తెనాలిరూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత పేర్కొన్నారు. తెనాలి సబ్ జైలును శనివారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గతంలో చేసిన పొరపాట్లను ఇకపై చేయకుండా జైలులోనే మంచి నడవడిక అలవరుచుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది ఖాదర్ బాషా, లీగల్ సర్వీసెస్ సిబ్బంది మహబూబ్ ఉన్నారు.

7న మెగా ఈవెంట్

తెనాలిటౌన్: పట్టణంలోని కొత్తపేటలో ఉన్న రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మే 7న సాయంత్రం 5.30 గంటలకు తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'హా హా గేమ్స్ అండ్ ఫన్ ఫ్యామిలీ షో' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. షోకు సంబంధించిన బ్రోచర్‌ను లక్కరాజు సాయి, పాటిబండ్ల శ్రీనివాసరావు, పోలిశెట్టి నాగరాజు, సునీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్కరాజు సాయి మాట్లాడుతూ ఫ్యామిలీ షోలో జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ టీమ్, సినీ కొరియోగ్రాఫర్‌తో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొని వివిధ బహుమతులు గెలుచుకోవచ్చని చెప్పారు. లక్కీ డిప్ ద్వారా కారు బహుమతి గెలుచుకునే అవకాశం ఉందన్నారు. పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిటౌన్: డివిజన్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆదివారం వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులను చెల్లించే ఏర్పాటు చేశామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ వీవీ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్ విధానం, వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా బిల్లులను చెల్లించవచ్చని తెలిపారు.

'ఏఐఎస్ఎఫ్' మోడల్ ఎంసెట్ టెస్ట్

తెనాలిరూరల్: ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఎంసెట్ పరీక్షపై అవగాహన కల్పించేందుకు పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రశ్నపత్రం చేయించామని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, చెన్నూరి సాయి, తలతోటి శ్రీను, కావేటి యశ్వంత్, శివ, పవన్ పరీక్షను పర్యవేక్షించారు.

ప్రజా మద్దతు మరింత బాధ్యతను పెంచింది..

- 'జగనన్నే మా భవిష్యత్తు' నిర్వహణలో నెంబర్‌వన్‌గా తెనాలి
- సర్వేలో అద్భుత తీర్పునిచ్చిన ప్రజలకు రుణపడి ఉంటా
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన ఖలేదా నసీమ్

తెనాలి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో 23 రోజులపాటు నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో ప్రజా మద్దతు కూడగట్టంలో తెనాలి నియోజకవర్గం జిల్లాలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. అపూర్వ మద్దతు పలికిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మరింత బాధ్యతతో రానున్న కాలంలో ప్రజా సేవను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక గంగానమ్మ పేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విలేకరులకు సర్వే ఫలితాలను వెల్లడించారు. మెగా పీపుల్స్ సర్వేలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ప్రజలు అపూర్వరీతిలో మద్దతు పలికారని చెప్పారు. తెనాలి నియోజకవర్గం ప్రజా మద్దతులో జిల్లాలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. 1,04,262 కుటుంబాలుంటే, 93,263 కుటుంబాలు ప్రభుత్వానికి మద్దతు తెలియజేశాయని, 72 వేల మంది మిస్డ్ కాల్ ఇచ్చారని చెప్పారు. దేశ రాజకీయాల్లో మరే రాజకీయ పార్టీ ఇంతటి బృహత్తరమైన మెగా పీపుల్స్ సర్వేను క్షేత్రస్థాయిలో ఇంతవరకు చేపట్టలేదని ఎమ్మెల్యే అన్నాబత్తుని సంతోషం వ్యక్తం చేశారు. 80 సచివాలయాలకు 240 మంది కన్వీనర్లు, 3,168 గృహ సారథులు సర్వేలో పాల్గొన్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపును పార్టీ శ్రేణులు శిరోధార్యంగా భావించి మెగా సర్వేలో అంకితభావంతో పనిచేశారని తెలిపారు. సంక్షేమ పథకాలను అవినీతి లేకుండా క్యాలెండరు ప్రకారం నిర్ణీత సమయానికి అందిస్తున్న ప్రభుత్వ పనితీరుకు ప్రజలిచ్చిన గొప్ప తీర్పుగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు అద్భుతమంటూ, స్టిక్కరును ఇంటిగోడపై కాకుండా జగన్ బొమ్మను గుండెల్లో పెట్టుకుంటామని ప్రజలు తేల్చిచెప్పారని పేర్కొన్నారు. ఇంతటి అద్భుతమైన తీర్పును ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటామని, రాబోయే రోజుల్లోనూ ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మద్దతు ఉందని విర్రవీగేది లేదన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారానికి క్షేత్రస్థాయిలో కనిపించే నిజాలే సమాధానాలుగా స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కన్వీనర్లు తాడిబోయిన రామయ్య, ఫరీద్, పార్టీ నేత తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. కన్వీనర్లు మన్నవ ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, కాళిదాసు సత్యం, షేక్ నూర్ ఇస్మాయిల్, యాతాటి అనిల్, వీరవసంతరావు, ఆవుల కోటయ్య, కృష్ణబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురమ్మ, పార్టీ నేతలు దేవరపల్లి కిశోర్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, కాకి దేవసహాయం, చింతా సురేష్‌యాదవ్, మద్దాళి శేషాచలం, షేక్ అబ్దుల్ ఖాదర్, వేజండ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



తెనాలి రూరల్: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో తెనాలి చెంచుపేటలోని కేఎస్ఎస్ఎం హైస్కూలు ఉంది. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కె.రవిబాబు పరిశీలించారు. పరీక్ష గదుల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. తెనాలిలో మొత్తం 166 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 29 మంది గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

- గత సమావేశం ఘటనపై నిజ నిర్ధారణ కమిటీ
- ప్రకటించిన చైర్ పర్సన్ ఖాలేదా నసీమ్
- సమావేశం మొత్తం నిలబడి నిరసన వ్యక్తం చేసిన టీడీపీ సభ్యులు



హాజరైన కౌన్సిల్ సభ్యులు, నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ సభ్యులు



చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిరూరల్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ప్రశాంతంగా ముగిసింది. గత సమావేశంలో కౌన్సిలర్ల దాడి ఘటన నేపథ్యంలో ప్రస్తుత సమావేశం ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉందని భావించినా.. అజెండాలోని అంశాలను ఆమోదిస్తూ ప్రశాంతంగా జరిగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఉదయం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం అధ్యక్షతన 11.30 గంటలకు సమావేశం ప్రారంభమయ్యింది. అజెండాలో పొందుపరిచిన 17 అంశాలను ఆమోదం నిమిత్తం సభ్యుల ముందుంచారు. అయితే గత నెల సాధారణ సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో టీడీపీ కౌన్సిలర్లు నల్ల రిబ్బన్లు, ప్లకార్డులతో సమావేశానికి హాజరయ్యారు. ముందుగా మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. అక్కడ నుంచి ప్లకార్డులు, నల్ల రిబ్బన్లతోనే నేరుగా కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. కౌన్సిల్‌లో కూర్చోకుండా తమ తమ స్థానాల్లోనే నిలబడి మౌన ప్రదర్శన ద్వారా నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చట్టాల్ని, ఆస్తులను కాపాడాలని, ప్రతిపక్ష కౌన్సిలర్ల ప్రాణాలను కాపాడాలని సభలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారిని కూర్చోవాలంటూ చైర్ పర్సన్ పదే పదే సూచించినప్పటికీ వినలేదు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ, గత కౌన్సిల్ సమావేశంలో చోటుచేసుకున్న పరిణామాలపై నిజ నిర్ధారణ కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. బాధ్యతాయుతమైన పదవిలో తాను ఉన్నందున అసలేం జరిగిందో తెలుసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజలకు కూడా తెలియాల్సి ఉందన్నారు. అందుకే ఎంతో పారదర్శకంగా విచారణ జరగాలని భావించి వైఎస్సార్ సీపీ సభ్యులతో పాటు టీడీపీ సభ్యులను కూడా కమిటీలో వేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీలో వైఎస్సార్ సీపీ సభ్యులు తాడిబోయిన రామయ్య, మాలేపాటి హరిప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుంచి దివి అనిత ఉంటారని, వీరు విచారణ జరిపి నివేదిక ఇవ్వగానే తదుపరి చర్యలు ప్రకటిస్తామని తెలిపారు. అయితే సమావేశం అనంతరం కౌన్సిల్ హాలు బయట టీడీపీ సభ్యులు పసుపులేటి త్రిమూర్తి మీడియాతో మాట్లాడుతూ, చైర్ పర్సన్ ప్రకటనను వ్యతిరేకించారు. ఆ రోజు సభలో అందరూ చూస్తుండగానే తమ సభ్యుడిపై దాడి చేశారని, ఇప్పుడు నిజ నిర్ధారణ కమిటీ ఎందుకని ప్రశ్నించారు. నాటి ఘటనపై బాధ్యుల మీద చర్యలు తీసుకోండి.. లేదంటే వదిలేయండి కానీ తమను మభ్యపెట్టడానికి కమిటీలు వేయవద్దని సూచించారు. మొత్తం మీద కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగియడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

27వేల మందికి ఇళ్ల స్థలాలివ్వడం నా అదృష్టం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల పరిశీలన



నిర్మాణం పూర్తయిన ఇంటిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తెనాలి నియోజకవర్గంలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వటం తన అదృష్టమని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు రూరల్ మండలం పెదరావూరు జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల పనులు చూసినప్పుడల్లా తనకెంతో సంతోషంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులతోనే ఇంతటి భాగ్యం దక్కిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెదరావూరులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని, నివాసం ఉంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి అభినందించారు. ఇల్లు లేని తమకు స్థలం ఇవ్వటంతో పాటు, ఇల్లు కట్టించి ఇవ్వటం సంతోషంగా ఉందని లబ్ధిదారులు ఎమ్మెల్యే శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని కాలనీలను నాలుగు రోజులు సందర్శించి, ఇళ్ల నిర్మాణాలను వేగిరం చేస్తామని ఈ సందర్భంగా శివకుమార్ చెప్పారు. అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి కావాల్సిందేనని అధికారులకు ఆయన స్పష్టంగా చెప్పారు. సిరిపురం, నేలపాడు లే అవుట్లలో కూడా గృహ నిర్మాణాలు శరవేగం కావాలని సూచించారు. వీరితో గృహ నిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు, డీఈఈ రఫీ, మున్సిపల్ ఇంజినీరు నాగమల్లేశ్వరరావు, డీఈఈ శివరామకృష్ణ ప్రసాద్, ఏఈ ఫణి, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, సంజీవరెడ్డి, సుభాని, గోపాలం శరత్, అక్కిదాసు కిరణ్ ప్రభృతులున్నారు.

విద్యార్థులకు పెద బాలశిక్ష పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెద బాలశిక్ష, నీతి కథలు, పంచతంత్ర కథల పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. స్థానిక బీసీ కాలనీలోని వేజళ్ల వెంకట సుబ్బారావు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు.. పుస్తకాలను అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం విద్యార్థులు చదివిన పుస్తకాలపై సమీక్ష నిర్వహించి పురోగతిని పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, భీమవరపు శివరామకృష్ణ, ఎస్.బసవేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ట్రస్టు నిర్వాహకురాలు వేజళ్ల నవ్య పర్యవేక్షించారు.

3న దుగ్గిరాలలో పసుపు రైతుల రాష్ట్రస్థాయి సదస్సు

క్వింటా పసుపుకు రూ.10వేల మద్దతు ధర ప్రకటించాలి



రైతులకు కరపత్రాలు అందజేస్తున్న శివశంకరరావు

వల్లభాపురం(కొల్లిపర): ప్రభుత్వం క్వింటా పసుపుకు రూ.10వేలు కనీస మద్దతు ధర నిర్ణయించి, అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.శివశంకరరావు డిమాండ్ చేశారు. శనివారం వల్లభాపురం గ్రామంలోని పేరంటాలమ్మ దేవాలయం వద్ద రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పసుపు సాగు చేస్తున్న రైతులు ఏటా ఎకరానికి సుమారు రూ.75 వేల నుంచి రూ.90 వేల వరకు నష్టపోతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పసుపు బోర్డును ఏర్పాటు చేసి, పసుపు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి కార్యాచరణకు మే 3న దుగ్గిరాల పసుపు వర్తక భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సులో రైతులు పాల్గొని, సమస్యలు తెలియజేయాలని కోరారు. అనంతరం రైతులకు కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, రైతులు గుదిబండి శివరామిరెడ్డి, వంగా రామిరెడ్డి , లంకిరెడ్డి సుబ్బారెడ్డి , బద్దుగు గణపతి, ఉయ్యూరు నరసింహారెడ్డి, వంగా శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలిటౌన్: గాంధీ నగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు వల్లూరి నీలిమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు వల్లూరి రమేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు యోగ సభ్యుల సేవా కార్యక్రమాలను అభినందించారు. ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఐలవరం విద్యార్థులు



ఐలవరం(భట్టిప్రోలు): కర్నూలులోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో ఆది, సోమవారాల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో.. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఐలవరం జెడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులు ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పీఈటీ తుమ్మా శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. జె.హరివర్మ, ఎం.మల్లికార్జున జిల్లా జట్టులో స్థానం సంపాదించారని చెప్పారు. వీరిని హెచ్ఎం లక్ష్మీన్నారాయణ అభినందించారు.

రంగస్థల నటులకు 'ఎన్టీఆర్' పురస్కారాలు

పాల్గొన్న సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా



గోపరాజు రమణ దంపతులకు పురస్కారం అందజేస్తున్న సురేంద్ర, సాయి మాధవ్

తెనాలిటౌన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఏడాదిపాటు నిర్వహించడం చరిత్రలో నూతన అధ్యాయమని టీవీ, రంగస్థల నటుడు గోపరాజు రమణ పేర్కొన్నారు. కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో శనివారం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రంగస్థల పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. సభకు సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అధ్యక్షత వహించారు. మాజీ కౌన్సిలర్ షేక్ నాగూర్‌బీ జ్యోతి ప్రజ్వలన చేశారు. రంగస్థల పురస్కారాలను సినీ, టీవీ, రంగస్థల నటులు గోపరాజు రమణ (కొలకలూరు), దాసరి రమాదేవి(హైదరాబాద్)కి టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ పాలడుగు సురేంద్ర అందజేశారు. వారిని సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. సినీ రచయిత సాయి మాధవ్, రంగస్థల దర్శకుడు డీఎస్ఎన్ మూర్తి, రంగస్థల నటుడు గంగోత్రి సాయి, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడారు. పురస్కార గ్రహీత రమణ మాట్లాడుతూ జీవితంలో తాను ఈ స్థాయిలో ఉండటానికి తెనాలి ప్రధాన కారణమన్నారు. మరో పురస్కార గ్రహీత రమాదేవి మాట్లాడుతూ ఎన్టీఆర్ పుట్టిన జిల్లాలోనే జన్మించి, ఆయన పేరుతో అవార్డు అందుకోవడం తమ అదృష్టంగా భావిస్తునట్లు చెప్పారు. వెంకటలక్ష్మీ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో డాక్టర్ వేమూరి శేషగిరిరావు, తాడిబోయిన హరిప్రసాద్, అలపర్తి వెంకటేశ్వరరావు, దేవిశెట్టి కృష్ణారావు, పినపాటి సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె: పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పాదచారులు, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కౌన్సిలర్లు నిరంతరం తమ వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఏజెండాలోని 13 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కమిషనర్ విజయ సారథి, కౌన్సిలర్‌లు, అధికారులు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బండ్లమ్మకు పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో వైశాఖ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. బాపట్ల ఆర్టీఓ చంద్ర శేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో వేద పండితులతో చండీహోమం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులకు ఘన స్వాగతం పలికారు. బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు లీలా శ్రీనివాసరెడ్డి, కనికిచర్ల వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

రేపల్లెరూరల్: పేకాట ఆడుతూ ముగ్గురు పట్టుబడిన ఘటన రావి అనంతవరం గ్రామంలో శనివారం జరిగింది. పట్టణ సీఐ విజయచంద్ర వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో రావి అనంతవరం గ్రామంలో దాడులు చేశామన్నారు. సమీపంలోని పొలంలో ముగ్గురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి రూ.3,150 నగదు స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పక్షి దప్పిక పాట్లు



భట్టిప్రోలు: ఈ వేసవి ఎండలు మండిపోతున్నాయి. పశుపక్ష్యాదులకు దప్పిక పాట్లు తప్పడం లేదు. నీటి చుక్క ఎక్కడ కనిపించినా.. దాహార్తిని తీర్చుకునేందుకు పక్షులు వాలిపోతున్నాయి. భట్టిప్రోలులో ఓ కాకి, పిట్ట దాహం వేయడంతో ఇలా కుళాయి వద్ద నీటి చుక్కలను తాగేందుకు ప్రయత్నిస్తూ.. కనిపించాయి.



రేపట్నుంచి ఉచిత యోగా తరగతులు

తెనాలిరూరల్: పట్టణంలోని మోరిస్ పేటలో ఉన్న నల్లమోతు చెంచురామానాయుడు మున్సిపల్ హై స్కూలు, గంగానమ్మ పేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూలులో ఉచిత యోగా శిక్షణ తరగతులను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్‌సీఆర్ స్కూలులో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఆయుష్ శాఖ సహకారంతో బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం యోగ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జూన్ 3 వరకు తరగతులు ఉంటాయని, వివరాలకు ఆయా పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

కాశీలో గంగాహారతి

తెనాలిటౌన్: కాశీలో జరుగుతున్న గంగానది పుష్కరాలు సందర్భంగా శనివారం పట్టణానికి చెందిన మహిళలు గంగానదికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో పూజ్యశ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో గంగానది వద్ద భక్తులు నదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.